

# ఆకాశవాణి

## సంగీత సమీక్ష...

"పరుసవేది"

సోమవారం, 11—12—50

### నుసర్ల శివరామ్‌గారి పాట-

చక్కని కల్పనా శక్తి, రాగజ్ఞానం ప్రదర్శిస్తూ గానం చేశారు శివరామ్‌గారు. శారీరం గౌళం గాఢంగాంటే వీనులకు రక్తికడుతుంది. తంబురా శ్రుతంగా మీటుతుంటూ, తెల్లవారుఝామున ఒకగంటసేపు ఒక్కొక్క స్వరము, అకార సహితము వింటూ గాత్రంతో బరువుగా పలుకుతూ, విలంబ ద్రుత కాలాల్లో సాధకంచేస్తే గాత్రానికి రాగలిగినంత నాదం అలవాటుగా వస్తుంది. అట్లాంటి సాధనానికి చలిరోజులు ప్రశస్తము.

### సి. కె. సరోజగారి గానం —

పావుగంటసేపు పాడి ఇంత ఆనందం కలుగచేసిన గాయనీమణు లెందరో లేరేమో అనిపించింది. అఠోగి వర్ణంలో కల్పన స్వరాలు చక్కని రాగజ్ఞానం ప్రదర్శిస్తూ పాడారు. హరి కల్యాణి రాగము, కీర్తన శ్రేష్ఠమైన జ్ఞానంతో గానం చేశారు. పాడిన ప్రతి అక్షరమూ, ప్రతి సంగతి సరియైన కాలంతో చాలా రంజకంగా వున్నాయి. మళ్ళీవీరి గానం సావకాశంగా వినగలమని ఆశ.

మంగళవారం, 12—12—50

### పుల్లెల పేరిసోమయాజులుగారి వైలిన్ వాద్యం.

చక్కటి సాధనచేసి స్వరస్థానములను బాగా స్వాధీనము చేసుకున్నారు వీరు. గమకాలను పలికించడములో తగినంత శ్రద్ధ చూపించాలా అని ప్రశ్న. అవసరం లేకపోయినా వేగము కోసం అతి ద్రుతకాలములో ఆరోహణ లేక అవరోహణ క్రమములో కొన్ని స్వరాలు దుముకుతూ వుండడం, రాగానికి అనుగుణంగా గమకము పొందుపరచడం వీరికి అవసరం. భంగం కలుగజేస్తాయి కదా! హరి కల్యాణి కీర్తన చాలా చౌకం అవడంవల్ల స్వరూపానికి లోటు వచ్చింది. సుస్వరం చేతికి స్వాధీనమైన తర్వాత పెద్ద తరహా సంగీతముపై దృష్టి నిలిపి కష్టం చెయ్యాలి యువకులందరూను.

### టి. వి. యస్. వీరస్వామిపిళ్ళెగారి నాగస్వరగానం-

ఎప్పుడూ ఆనందం గొలిపే జంత్రవాద్యకులలో శ్రీ వెంకటస్వామి నాయుడుగారు స్వామినాథపిళ్ళెగారి వలెనే వీరొకరు. రవ్వంతైనా పెళుసుగా లేకుండా అతి సున్నితముగా వింతము చెడకుండా గాలిపోస్తూ నూతన కల్పనలతో కర్ణానందముగా రాగప్రస్తారములు వినిపించారు పిళ్ళెగారు. నాగస్వర విద్వాంసులలో వీరి నాదర్శపురుషులుగా భావించవచ్చును. నేడు ఖరహరప్రియ రాగము అతి మనోహరముగా వినిపించారు.

బుధవారం, 13—12—50

### కె. పి. నారాయణరావుగారి వీణావాద్యం

చక్కని రాగభావముతో విన్యాసమునకు లోబడిన సంగతులను నిదానంగా గంభీరనాదముతో వాయించారు. తానం వాయించిన బాణీ బాగుంది. వాటు, శంకరాభరణము, ఆసావేరి, ఉసేని రాగాలు ఇంపుగా వున్నాయి. ఇదే పద్ధతిలో గ్రంథం బాగా పాఠంచేసి శ్రమపడితే మంచిపేరు తెచ్చుకోగలరు వీరు.

గురువారం, 14—12—50

### మైసూర్ టి. చౌడయ్యగారి వైలిను వాద్యం.

బలహీనమైన రాగాన్ని సవలీలగా ఆలాపనచేసి తానం పల్లవి వాయించారు. పేరెక్కిన విద్వాంసులూ, పేరుతెచ్చుకోవాలనే అభిలాషకల యువకులూ ఈ మోస్తరు రక్తి అన్యరాగములు ఆలాపనచేసి సంగీతలోకానికి ముదం చేకూర్చాలి. నాలుగు కళల చౌకంలో పల్లవి వాయించబట్టి మణిగారికి సావకాశముగా గతి ప్రస్తారం చేస్తూ మృదంగం ప్రత్యేక శిక్షకోసము 45 నిముషాలు వినియోగపరుస్తున్నప్పుడు రాగ, తాళములో ఏదో ఒక విశేషము ప్రదర్శించాలి గాని కాలయాపన పల్లవులు వాయించడంలో అర్థములేదు.

1950 దశకంలో ఆనందవాణి అనే పత్రికలో " ఆకాశవాణి - సంగీత సమీక్ష " శీర్షికతో ప్రచురించబడ్డ వ్యాస పరంపరలోని కొన్ని వ్యాసాలు ఇక్కడ చూడవచ్చు.

ఇలాటివి, మరియు ఆకాశవాణికి సంబంధించిన ఏ చిన్న భాగం అయినా, అది ఆడియో అవ్వొచ్చు, ఫోటో అవ్వొచ్చు, వ్యాసం అవ్వొచ్చు, మరేదైనా అవ్వొచ్చు, అవి మీ వద్ద వుంటే పంచుకోగలరని ఆశిస్తూ....

కాపీరైటు హక్కుల ఉల్లంఘన ఉద్దేశం లేదనీ, లాభాపేక్ష / ధనార్జన ఉద్దేశమంతకన్నా లేదనీ సవినయంగా తెలియచేసుకుంటూ - ఈ వ్యాసాలు ఇక్కడ, ఇలా రేడియో అభిమానులకు అందుబాటులో ఉంచటానికి అభ్యంతరాలు ఎవరికైనా ఉంటే తప్పక తెలియపర్చండి. క్షమాపణలతో వెంటనే తొలగిస్తాను.

భవదీయుడు

మాగంటి వంశీ మోహన్

http://www.maganti.org/